సాక్షి
ప్రకాశం

మంగళవారం । 16 । మే । 2023



అంకితభావంతో పనిచేయాలి

స్పందన అర్జీలు సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. - 8లో..



పేదల సంక్షేమాన్ని అడ్డుకోవడమే టీడీపీ నేతల పని

పేదల సంక్షేమాన్ని టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
46.5 /32

వాతావరణం

ఆకాశం పొడిగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికం. ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పీఎంజీఎస్‌వై పనులపై ఎంపీ వినతి

- కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి శైలేష్‌కుమార్‌ను కలిసి విన్నవించిన మాగుంట



కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు: పీఎంజీఎస్‌వై 3 పథకం కింద ఒక రోడ్డు, రెండు బ్రిడ్జిల ఏర్పాటుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సోమవారం ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి శైలేష్‌కుమార్‌సింగ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పొన్నలూరు మండలంలోని ముప్పాళ్ల గ్రామం వద్ద పాలేరు నదిపై బ్రిడ్జిని, టంగుటూరు మండలం కొండపి నుంచి యం.నిడమానూరు వరకు ఉన్న రోడ్డును, ముసి నదిపై ఒక బ్రిడ్జిని 2023-24 పీఎంజీఎస్‌వై 3 పథకం కింద చేర్చాలని కోరారు. పొన్నలూరు మండలంలోని పాలేరు నదికి ఇరువైపులా ఉన్న 20 గ్రామాల ప్రజలు పాలేరు నదిపై బ్రిడ్జి లేనందున కందుకూరు రెవెన్యూ హెడ్ క్వార్టర్స్‌కు, ఒంగోలు జిల్లా కేంద్రానికి రాకపోకలకు చాలా దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. టంగుటూరు మండలంలోని యం.నిడమానూరు, జయవరం, కారుమంచి తదితర గ్రామాల్లోని సుమారు 20 వేల మంది ప్రజలు టంగుటూరు మండల కేంద్రానికి, పొగాకు వేలం కేంద్రాలకు కొండపి నుంచి యం.నిడమానూరు వరకు రోడ్డులేక, ముసి నదిపై బ్రిడ్జి లేక చాలా ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ మూడు పనులను పీఎంజీఎస్‌వై 3 పథకం కింద చేర్చి ఈ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని కోరారు. దానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్‌కుమార్ సింగ్ సానుకూలంగా స్పందించి పనులను పీఎంజీఎస్‌వై 3 పథకం కింద నిర్మించేందుకు తగిన చర్యలు తప్పక తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ మాగుంట పేర్కొన్నారు.



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న చర్చి సెంటర్

నిప్పుల కొలిమి

వేసవి తారెత్తిస్తోంది. ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. వడగాలులు ఉధృతమయ్యాయి. వెచ్చటి గాలులతో జిల్లా నిప్పుల కొలిమిలా మారింది. ఉదయం 7 గంటల నుంచి సూర్యాస్తమయం తరువాత కూడా వేడిగాలులు వీస్తూనే ఉన్నాయి. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జిల్లాలో 42 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడచిన 24 గంటల్లో ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. జిల్లా కేంద్రంతో పాటు ప్రధాన పట్టణాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వడదెబ్బకు నలుగురు మృతి చెందారు. మరో ఐదు రోజులు ఇవే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

- భారీగా పెరుతున్న ఉష్ణోగ్రతలు
- జిల్లాలో 42 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదు
- 24 గంటల్లో పెరిగిన నాలుగు డిగ్రీలు
- వేడి గాలులతో సతమతమవుతున్న ప్రజానీకం
- ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత

ఒంగోలు అర్బన్: మే నెల ఎండలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. అత్యవసర పనులకు సైతం ఎండ సమయంలో బయట తిరగాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రం ఒంగోలులో గడిచిన మూడు రోజులుగా 42 డిగ్రీల పైనే ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం తర్లుపాడులో 46.5, మద్దిపాడు మండలం గుండ్లాపల్లిలో 45.96, కురిచేడులో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడదెబ్బతో జిల్లాలో ఒకే రోజు నలుగురు మృతిచెందారు. మరో నాలుగైదు రోజుల పాటు ఉష్ణోగ్రతలతో పాటు వడగాలులు పెరుగుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. గడచిన మూడేళ్లతో పోల్చుకుంటే ఈ ఏడాది ఎండలు ఎక్కువగానే ఉన్నాయి. 2020, 2021 సంవత్సరాల్లో ఇదే నెలలో 40 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో 21వ తేదీ నుంచి నెలాఖరు వరకూ 41 నుంచి 44 డిగ్రీలతో ఎండ తీవ్రత ఉంది. ఈ ఏడాది రెండో వారం నుంచి సూర్యుడు సెగలు పుట్టిస్తున్నాడు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో ఇప్పటికే పెద్ద ఎత్తున చలివేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచి తాగునీరు, మజ్జిగ వంటివి సరఫరా చేస్తున్నారు. అలాగే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వడదెబ్బ బాధితులకు వైద్య సేవలు అందించేందుకు సర్వం సిద్ధం చేశారు.

అప్రమత్తంగా..

పెరిగిన ఎండలు, వేడి గాలుల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావడం మంచిది కాదని అటు డాక్టర్లు, ఇటు అధికార యంత్రాంగం హెచ్చరిస్తోంది. ఉదయం 11 గంటల లోపు పనులు చూసుకుని ఎండ తీవ్రత తగ్గిన తర్వాత సాయంత్రం 4 గంటల సమయంలో మాత్రమే బయటకు రావాలని సూచిస్తున్నారు. ఒక వేళ అవసరం రీత్యా బయటకు వచ్చినా తాగునీరు, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలని, తలపై టోపీ లేదా గొడుగు వంటివి వినియోగించాలని సూచిస్తున్నారు. ఉపాధిహామీ పనులకు వెళ్లే ప్రజలు, వ్యవసాయ కూలీలు, మైనింగ్ కార్మికులు ఉదయం 11 గంటల నుంచి ఇంటికి చేరుకోవాలని ఆ మేరకు మైనింగ్ పరిశ్రమల్లో పగలు డ్యూటీలను సైతం అధికారులు రద్దు చేశారు. డీహైడ్రేషన్, వడ దెబ్బ తగలకుండా తాగునీరు, కొబ్బరినీళ్లు, గ్లూకోజ్, ఓఆర్ఎస్, మజ్జిగ, పండ్ల రసాలు వంటివి ఎక్కువగా తీసుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధుల పట్ల మరింత జాగ్రత్తలు వహించాలని, వడగాలులు, వేడి వాతావరణానికి దూరంగా ఉంచాలని అంటున్నారు. ఎండ తీవ్రతకు తల తిరిగినా, నోరు పొడిబారిపోయినా, వడదెబ్బ తగిలినట్లు అనుమానం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.



నిత్యం రద్దీగా ఉండే ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ సెంటర్ ఇలా..

జిల్లాలో ఉష్ణోగ్రతల వివరాలు

	గరిష్టం	కనిష్టం
తర్లుపాడు	46.05	32
గుండ్లాపల్లి	45.96	32
కురిచేడు	45	32
చినారికట్ల	44.99	32
పెద్దారవీడు	44.71	32
కొనకనమిట్ల	44.57	32
త్రోవగుంట	44.56	32
ఒంగోలు	43	32

ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి



వేసవికాలం ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవడం మంచిది. కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలి. తల తిరిగినా, నోరు పొడిబారిపోయినా వెంటనే వైద్యులను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. వడదెబ్బతో సొమ్మసిల్లి పడిపోతే వారికి ఎట్టిపరిస్థితిల్లో నీటిని ఇవ్వరాదు. వృద్ధులు, చిన్నపిల్లలు, గుండె వ్యాధి బాధితులు, షుగర్, కిడ్నీ బాధితులు ఇతర దీర్ఘ కాలిక వ్యాధులు ఉన్న వారు మరింత జాగ్రత్తలు పాటించాలి. ప్రజలు వేడిగాలులు, ఎండ తీవ్రత సమయంలో బయటకు రాకపోవడమే శ్రేయస్కరం. నోరు, శరీరం పొడిబారినా, కళ్లు తేలేసినట్లు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ మంగలపు సుందర్, పీహెచ్‌సీ వైద్యులు

వడగాడ్పులకు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ కె.శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో తీవ్రమైన ఎండలతో పాటు వడగాల్పులు పెరిగాయని, మరో నాలుగైదు రోజుల పాటు మరింత తీవ్రత పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం స్పందన భవనంలో ఎండతీవ్ర, వడగాల్పులపై విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రస్తుతం 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోందని మరికొంత మేరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని అన్నారు. ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు బయట తిరగవద్దని హెచ్చరించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్, రైతు కూలీలు, మైనింగ్ కార్మికులు కూడా ఉదయం 11 గంటల లోపు పనులు చేసుకుని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. మైనింగ్ పరిశ్రమలకు సంబంధించి పగలు షిఫ్టని రద్దు చేశామన్నారు. వడగాల్పులు, ఎండ తీవ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలును ప్రజలకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సచివాలయాల్లో కూడా అందుబాటులో ఉంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటికి 670 చలివేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉంచి తాగునీరు, మజ్జిగ వంటివి సరఫరా చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వడదెబ్బ బాధితులకు వైద్య సేవలు అందించేందుకు సర్వం సిద్ధం చేసి జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. ప్రాణ నష్టం లేకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు కూడా అవగాహనతో ఎండ తీవ్రత సమయంలో బయటకు రాకూడదని కోరారు.

తాగునీటికి సంబంధించి అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. పశువులకు అవసరమైన నీటిన అందిస్తున్నామన్నారు. పశు పోషకులు పశువులను ఎండ సమయంలో బయట తిప్పవద్దని సూచించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్ఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాల ఐక్యతతో అభివృద్ధి



పూలే భవనం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



బీసీ కులాల ఆరామ క్షేత్రాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- బీసీ ఆరామ క్షేత్రాలు, బీసీ పూలే భవన్‌కు శంకుస్థాపన

ఒంగోలు: బీసీ కులాల ఐక్యతతో ఏదైనా సాధించుకోగలమన్న నమ్మకాన్ని ఒంగోలులోని బీసీ సామాజికవర్గ నేతలు నిరూపించారని మాజీ మంత్రి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక రంగారాయుడు చెరువు వద్ద 17 బీసీ కులాలకు ఒక ఆరామ క్షేత్రం, మిగిలిన అన్ని బీసీ కులాలకు మరో ఆరామ క్షేత్రంతోపాటు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ భవన్‌కు బాలినేని శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బీసీ కులాల ఐక్యతకు ఈ కార్యక్రమం అద్దం పడుతోందన్నారు. నిర్మాణం కూడా త్వరగా పూర్తిచేసుకోవాలని, బీసీ ఆరామ క్షేత్రాలకు తనవంతు ఆర్థిక సాయం కూడా అందిస్తానని చెప్పారు. నగరంలో ఎక్కువ మంది అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటారని, ఏదైనా అశుభం చోటుచేసుకుంటే అద్దె ఇళ్లల్లో కార్యక్రమం చేసుకునే వీలులేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు పునరావృతం కారాదనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు మాట్లాడుతూ కేవలం 100 రోజుల్లోనే ఆరామ క్షేత్రాల నిర్మాణాలు పూర్తిచేయాలనే కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. ఎన్నో దశాబ్దాల కల నేటికి నెరవేరుతుండడం ఆనందంగా ఉందని, బీసీల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్న బాలినేనిని 2024 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. రజక సంఘం రాష్ట్ర నాయకుడు గుర్రం సుబ్బన్న మాట్లాడుతూ నేడు ఆరామ క్షేత్రాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన ప్రాంతం బీసీలకు దక్కకుండా చేయాలని ఎంతోమంది ఎన్నో కుట్రలు పన్నారని, చివరకు కోర్టుల్లో గెలిచినా అందులోకి వెళ్లనీయకుండా అడ్డుకున్న వారికి ఈ కార్యక్రమం ఒక గుణపాఠం అన్నారు. బీసీలంతా ఏకతాటిపై నిలిచి రాబోయే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో బాలినేనిని గెలిపించుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 8 బీసీల కులాలకు ఒక్కొక్క దానికి 5 సెంట్లు చొప్పున నాడు బాలినేని కేటాయించారని, అయితే గత ప్రభుత్వ హయాంలో అది బీసీలకు దక్కకుండా చేయాలని అప్పటి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అడుగడుగునా అడ్డుపడ్డారన్నారు. అయినా మళ్లీ బాలినేని ఎమ్మెల్యేగా ఉండగానే 8 కులాల స్థానంలో 17 కులాలకు, మిగిలిన అన్ని బీసీలకు కలిపి మరో ఆరామక్షేత్రం ఏర్పాటుకు, బీసీ పూలేభవన్‌కు శంకుస్థాపన చేశారన్నారు. బీసీల పక్షపాతిగా బాలినేని శ్రీనివాసరెడ్డి మరోమారు నిరూపించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ, స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఢాకా సుజాత హనుమారెడ్డి, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, యనమల నాగరాజు, జెడా వెంకటేష్, తన్నీరు నాగజ్యోతి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకులు మోరుబోయిన సురేష్‌యాదవ్, బీసీ సెల్ రీజినల్ కోఆర్డినేటర్ బొట్ల సుబ్బారావు, నూర్‌భాషా కార్పొరేషన్ డైరెక్టర్ సోఫియా, బాచి, ఏపీఐఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ స్వాతి, విస్సు యాదవ్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పందేటి శ్రీనివాసరావు, మేదర సంఘం జిల్లా అధ్యక్షుడు చలపతిరావు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, స్వామి, ముదిగొండ సంఘం అధ్యక్షుడు చెంచయ్య, భట్రాజు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, భట్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ మారెళ్ల శ్రీదేవి శ్రీనివాసరావు, కృష్ణ బలిజ, సూర్య బలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు తిర్లిక శ్రీనివాసరావు, దాసరి కరుణాకర్, విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు గోనుగుంట బ్రహ్మానందశర్మ, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు స్వామి, ఉప్పర సంఘం జిల్లా అధ్యక్షుడు జూటూరి శ్రీనివాసరావు, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి, వీరాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలు ప్రమీల వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేశ్వరరావు, ధన్నారపు మస్తాన్‌రావు, కండే రమణయ్య యాదవ్, గంటా రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొండపి టీడీపీలో
అసమ్మతి ఫైర్..

- ఎన్టీయార్ శతజయంతి వేడుకల సాక్షిగా బయట పడిన విభేదాలు
- ఎమ్మెల్యే స్వామి పోకడపై విసిగిపోయిన ఆ పార్టీ నేతలు
- షాడో ఎమ్మెల్యే దామచర్ల సత్య తీరుపై ఆగ్రహం
- మాజీ ఎమ్మెల్యే పోతులతో పాటు బెల్లం జయంత్ వర్గం గైర్హాజరు
- ఎస్సీ, బీసీ నేతలను విస్మరించారని ఆరోపణ
- వెలవెలబోయిన సదస్సు ప్రాంగణం



టంగుటూరులోని ఎన్టీయార్ శతజయంతి ఉత్సవాల్లో ఖాళీగా ఉన్న కుర్చీలు



టీడీపీ నేతల వాహనాలు పెట్టనీయకుండా తాళం వేసిన పోతుల రామారావు అనుచరుల కంపెనీ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కొండపి నియోజకవర్గ టీడీపీలో ముసలం పుట్టింది. ఇప్పటి వరకు నివురు కప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి ఒక్కసారిగా రగిలిపోయింది. టంగుటూరులో సోమవారం నిర్వహించిన ఎన్టీయార్ శత జయంతి వేడుక ఇందుకు వేదికగా మారింది. ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి ఒంటెత్తు పోకడను పార్టీలోని సీనియర్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగే షాడో ఎమ్మెల్యేగా దామచర్ల సత్య వ్యవహారంపై సీనియర్ నాయకులు విసిగిపోయారు. ఇంత కాలం గుంభనంగా ఉన్న అసమ్మతి ఒక్కసారిగా వెలుగుచూసింది. దీంతో నియోజకవర్గంలో బలమైన వర్గాలుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, బెల్లం జయంత్ బాబు వర్గాలు ఎన్టీఆర్ శత జయంతి వేడుకలకు డుమ్మా కొట్టారు. జనం లేక సదస్సు వెలవెలబోయింది. ఎమ్మెల్యే స్వామికి పెద్ద షాక్ తగిలినట్లు అయింది.

నియోజకవర్గంలో దామచర్ల, పోతుల, బెల్లం వర్గాల పాత వివాదాలు నడుస్తున్నాయి. పార్టీలో సీనియర్ నాయకులను విస్మరిస్తున్నారని కొంతకాలంగా పార్టీకి దూరంగానే ఉంటూ వస్తున్నారు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు. ఆయన ఎన్టీయార్ శత జయంతి వేడుకలకు డుమ్మా కొట్టటంతో పాటు ట్రంకు రోడ్డులోని తన ప్రాంగణాన్ని సైతం ఉత్సవాలకు వచ్చే కార్ల పార్కింగ్‌కు కూడా ఇవ్వకుండా గేటుకు తాళం వేయించాడు. గతంలో ఎప్పుడు పార్టీ సమావేశాలు జరిగినా ఈ ప్రాంగణాన్ని కారు పార్కింగ్‌కు వినియోగించేవారు. ఇదిలా ఉండగా షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న దామచర్ల సత్య తీరును వ్యతిరేకిస్తున్న టంగుటూరు టీడీపీ నాయకుడు బెల్లం జయంత్ బాబు వర్గం కూడా అసమ్మతితో రగిలిపోతోంది. ఈ వర్గం కూడా వేడుకలకు దూరంగానే ఉండిపోయింది. రెండు బలమైన వర్గాలు దూరం కావడంతో కొండపి ఎమ్మెల్యే స్వామి, షాడో ఎమ్మెల్యే దామచర్ల సత్యలు ఏకాకిగా మిగిలిపోయారు. రిజర్వుడు నియోజకవర్గంలో ఎమ్మెల్యేని పక్కన పెట్టి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న దామచర్ల సత్యతో పాటు మరికొందరు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారే నియోజకవర్గంలో డామినేషన్ చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ, మైనారిటీలను కూడా పట్టించుకోక పోవడంతో ఆయా సామాజికవర్గాల నేతలు సైతం ఆగ్రహంగా ఉన్నారు. ఈ వర్గ విభేదాలు, సామాజిక విభేదాలు, టీడీపీ కేడర్‌లోని గ్రూపు రాజకీయాలు ఎన్టీఆర్ శత జయంతి వేడుకల్లో బయట పడటంతో పార్టీ అధిష్టానం సైతం ఉలిక్కిపడింది. కొండపి పంచాయితీ చంద్రబాబు వద్దకు చేరింది. అయినా అసమ్మతి నేతలు మాత్రం ససేమిరా అంటున్నట్లు సమాచారం. ఎంతో ఘనంగా నిర్వహించాలని గత వారం, పది రోజుల నుంచి ప్రణాళికలు రచించిన ఎమ్మెల్యేకి పెద్ద షాక్ తగిలినట్లయింది. రూ.లక్షలు వెచ్చించి చేసిన ఉత్సవాలు కేడర్ లేక గంటలోనే సదస్సు చాప చుట్టేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సదస్సుకు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన అతికొద్ది మంది కార్యకర్తలు, నాయకులు మాత్రమే రావటంతో ఎమ్మెల్యే స్వామికి వెన్నులో వణుకు పుట్టినంత పనైందని ఆయన సన్నిహితుల నుంచే వస్తున్న మాటలు. శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో టీడీపీకి చెందిన అగ్రనాయకుల ఫొటోలు కూడా లేకపోవటంతో కూడా పెద్ద చర్చ జరుగుతోంది. కొండపి వ్యవహారం జిల్లా రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. జిల్లాలో ఉన్న ఏకైక టీడీపీ ఎమ్మెల్యేగా ఉండే కొండపిలోనే ఈ పరిస్థితి నెలకొంటే మిగతా నియోజకవర్గాల్లో పరిస్థితి ఏ విధంగా ఉందోనన్న చర్చ తీవ్ర స్థాయిలో జరుగుతోంది.

దామచర్ల కుటుంబంలో వర్గపోరు...

టీడీపీకి చెందిన దామచర్ల కుటుంబంలో వర్గపోరు తార స్థాయిలో ఉంది. టంగుటూరులో జరిగిన ఎన్టీయార్ శత జయంతి వేడుకలకు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూడా హాజరుకాలేదు. ఎప్పటి నుంచో జనార్దన్, సత్యల మధ్య మనస్పర్థలు తారస్థాయిలో ఉన్నాయి. సత్యకు ఎమ్మెల్యే స్వామి మద్దతు ఇస్తున్నాడన్న విషయంలో స్వామితో జనార్దన్ విభేదిస్తూ వస్తున్నాడు. దీంతో అటు పోతుల, బెల్లం వర్గాలతో పాటు జనార్దన్ వర్గం కూడా కొండపిలో స్వామికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నట్లు సమాచారం.

వెలవెలబోయిన యువగళం సంఘీభావ యాత్రలు...

మాజీ ఎమ్మెల్సీ లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంఘీభావ పాదయాత్రలు చేపట్టాలని పార్టీ అధిష్టానం పిలుపునిచ్చింది. సోమవారం నియోజకవర్గాల వారీగా జరిగిన సంఘీభావ పాదయాత్రలు జనం లేక వెలవెలబోయాయి. టంగుటూరులో 2 వేల బైకులతో 7 కిలో మీటర్ల ర్యాలీ చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. అయితే బైకులు అనుకున్నన్ని రాకపోవటంతో కిలో మీటరుతోనే ర్యాలీని ముగించారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో చేపట్టిన ర్యాలీ మద్దిపాడు నుంచి మల్లవరం వరకూ చేపట్టాలని భావించారు. కేడర్ రాక మొక్కుబడిగా చేశారు. అదే విధంగా మిగతా నియోజకవర్గాల్లో కూడా తూతూ మంత్రంగా మ..మ అనిపించారు.

వడదెబ్బకు నలుగురు మృతి


మృతి చెందిన పాపిశెట్టి సూరిబాబు

సింగరాయకొండ: ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురై సోమవారం ఒకే గ్రామంలో ముగ్గురు మృతి చెందారు. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన సాబినేని సుబ్బమ్మ(56), శివాలయం వద్ద నివసిస్తున్న పాపిశెట్టి సూరిబాబు(57), వీఆర్‌ఓ కార్యాలయం సమీపంలో నివసిస్తున్న పొందూరి సుబ్బరామిరెడ్డి(68) మృతి చెందారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు మృతుల బంధువులు చెప్పారు. అలాగే సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండ పంచాయతీకి చెందిన కొట్టే పేరమ్మ(65) వడదెబ్బకు గురై మరణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడు దుర్మరణం


మృతి చెందిన ఈశ్వరయ్య

గిద్దలూరు రూరల్: కారు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన గిద్దలూరు మండలంలోని వేములపాడు గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. వేముపాడు గ్రామానికి చెందిన వేములపాటి ఈశ్వరయ్య(63) వ్యక్తిగత పనిమీద బైక్‌పై గిద్దలూరు వైపు వెళ్తున్నాడు. వేములపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఈశ్వరయ్య తలకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై బ్రహ్మనాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

18న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

దర్శి: స్థానిక ఎస్‌ఎస్‌పీ కాలనీలో ఈ నెల 18 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కౌన్సిలర్ పెద్దిరెడ్డి నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.30,116, ద్వితీయ బహుమతి రూ.20,116, తృతీయ బహుమతి రూ.10,116 అందజేస్తామన్నారు.

కార్యకర్తల కోసం ఎందాకైనా..

- కార్యకర్తల కోసం ఎవరినైనా ఎదిరిస్తా
- మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసమే పనిచేస్తా
- 2024 ఎన్నికల్లో ఒంగోలు నుంచే పోటీ చేస్తా
- పశ్చిమ ప్రకాశం నుంచి పోటీ చేస్తాననేది అసత్య ప్రచారమే..
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టీకరణ
- ఒంగోలు 39వ డివిజన్‌లో అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం


యూపీహెచ్‌సీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బాలినేని, పక్కన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే టీజేఆర్ తదితరులు

ఒంగోలు సబర్బన్:

'మీ కోసం ఎందాకైనా పోరాడతా, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఎదిరించి మిమ్మల్ని కాపాడుకుంటా' అని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఒంగోలు నగరంలోని 39వ డివిజన్ పీర్ల మాన్యంలో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకరబాబుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ.. ఇటీవల తనపై కొందరు పనిగట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, కుట్రలు చేశారని, అయినా వాటిని పట్టించుకోనని, తమ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈసారి ఎన్నికల్లో తాను ఒంగోలు నుంచి కాకుండా పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తాననేది అసత్య ప్రచారమేనని కొట్టిపడేశారు. తన రాజకీయ జీవితం ఒంగోలు నుంచే ప్రారంభించానని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ప్రధాన వైద్యశాలలతోపాటు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వాటికి దీటుగా రూపొందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను, వైద్యశాలలను బాగుచేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అవసరమైన చోట కొత్త ఆస్పత్రులను కూడా నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఒంగోలు నగరంలో ఒక్కో యూపీహెచ్‌సీని రూ.1.34 కోట్లతో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించినట్లు వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు స్థానికంగానే అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. వైద్యులు కూడా ప్రజల మన్ననలు పొందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ.. వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పేదలపైన పైసా కూడా భారం లేకుండా పూర్తి స్థాయిలో ఆరోగ్య భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పట్టణ ప్రాంతాల్లో వైద్యానికి ప్రజలు ఎక్కువగా ఖర్చు చేస్తున్నందున వారికి చేరువలోనే ఉచితంగా వైద్య సేవలు లభించాలన్నది రాష్ట్ర లక్ష్యమన్నారు. ఒంగోలు నగరంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 5 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి రోగులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర బాబు మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో నిర్లక్ష్యం చేసిన రంగాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. విద్య, వైద్యానికి సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ప్రాధాన్యతను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇవ్వలేదన్నారు. 2024 ఎన్నికల్లో బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలులో 50 వేల మెజార్టీతో గెలుస్తున్నారని జోస్యం చెప్పారు. దామచర్ల హయాంలో ఎన్ని నిధులు వచ్చాయో, బాలినేని హయాంలో ఎన్ని నిధులు వచ్చాయో చర్చించేందుకు ఎన్నోసార్లు టీడీపీ నేతలకు సవాల్ విసిరానని, కనీసం సమాధానం కూడా లేదన్నారు. ఎందుకూ పనికిరాని వారు కూడా బాలినేనిపై విమర్శలు చేస్తున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సుకు ఒంగోలు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ వేమూరి సూర్యనారాయణ, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఒడా చైర్మన్ సింగరాజు మీనాకుమారి, 39వ డివిజన్ కార్పొరేటర్ గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, బొట్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ కె.మాల్యాద్రి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఘనశ్యాం తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్మూర్తి నివాసంలో ఏసీబీ సోదాలు


శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యుల సమక్షంలో ఇంటి సీల్ తీస్తున్న ఏసీబీ అధికారులు

దర్శి: దర్శి పట్టణంలో నివాసం ఉంటున్న కంభం సబ్ రిజిస్ట్రార్ శ్రీరామ్మూర్తి నివాసంలో ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం సోదా చేశారు. ఇటీవల శ్రీరామ్మూర్తి నివాసానికి ఏసీబీ అధికారులు సీల్ వేసి వెళ్లిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీరామ్మూర్తి కుమారుడు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఇంట్లోకి ప్రవేశించి సోదాలు నిర్వహించారు. పలు డాక్యుమెంట్లు పరిశీలించినట్లు సమాచారం. ఏసీబీ అధికారులు మాత్రం ఎలాంటి విషయాలు వెల్లడించలేదు. దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు.

అక్రెడిటేషన్ దరఖాస్తు గడువు వారం పొడిగింపు

ఒంగోలు అర్బన్: జర్నలిస్టులు 2023–24 సంవత్సరానికి గాను అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో వారం రోజులు గడువు పొడిగించినట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీతో గడువు ముగియగా, పలు వార్తా సంస్థల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత పత్రాలను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు.

బాల్య వివాహాలు నియంత్రించాలి

- ఎస్పీ మలికాగర్గ్


మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై సోమవారం మహిళా పోలీసులతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు గ్రామ/వార్డు మహిళా పోలీసులను ఎస్పీ అభినందించారు. బాల్య వివాహాలను అడ్డుకోవడంలో ఎదురవుతున్న ఆటంకాలు, బాల్య వివాహాలు జరిగేందుకు సామాజిక, ఆర్థిక కారణాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, వివాహ నమోదు చట్టాలపై, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు వంటి అంశాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. 13 నుంచి 18 ఏళ్ల లోపు బాలికల వివాహాల నిర్మూలనకు క్షేత్ర స్థాయిలో మహిళా పోలీసులు క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. బాల్య వివాహాలపై సమాచారం సేకరించి సంబంధిత అధికారులకు త్వరితగతిన చేరవేయాలన్నారు. బాల్య వివాహాలపై సమాచారం సేకరించి అన్ని శాఖల అధికారుల సహకారంతో వాటికి అడ్డుకట్ట వేయాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత నాలుగు నెలల్లో అన్ని శాఖల అధికారులతో కలిసి 30 బాల్య వివాహాలను అడ్డుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్ లైన్ నెంబర్ 1098, ఐసీడీఎస్, పోలీసు, బాలల సంరక్షణ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యం.శివనాగాంజలి(ముండ్లమూరు), వి.ధనలక్ష్మి(పొన్నలూరు), ఏ.వాణి(ఒంగోలు వన్‌టౌన్), జి.హిమబిందు(గిద్దలూరు), పి.భారతి(సింగరాయకొండ) వారిని ఎస్పీ మలికాగర్గ్‌తోపాటు అదనపు ఎస్పీ అడ్మిన్ కె.నాగేశ్వరరావు, ఐటీ కోర్ ఎస్సై కె.అజయ్‌కుమార్, సిబ్బంది అభినందించారు.

ఎస్పీ స్పందనకు 84 ఫిర్యాదులు

ఒంగోలు: జిల్లా ఎస్పీ నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 84 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదిదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి అప్పటికప్పుడే సమస్య పరిష్కారానికి సంబంధిత పోలీసు అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. క్రెడిట్ కార్డు ద్వారా అమౌంట్ ట్రాన్సాక్షన్ చేసి ఆ అమౌంట్‌ను క్యాష్‌గా మార్చి తమ అకౌంట్‌కు బదిలీ చేస్తామని నమ్మబలికి భారత్‌పే కంపెనీలో పనిచేసే వ్యక్తి రూ.1.10 లక్షలకు మోసం చేశాడని ఒంగోలు వాసి ఒకరు ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ పథకంలో టైపింగ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి నరశింగరావు, సాయి జనార్దన్‌లు నమ్మించి రూ.50 వేలు తీసుకొని మోసం చేసి బెదిరిస్తున్నారని కొండపికి చెందిన అనీల్‌కుమార్ ఫిర్యాదుచేశాడు. స్పందనలో అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎస్‌వీ శ్రీధరరావు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ప్యానెల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, స్పందన ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ఒంగోలు: చదువు భారంగా మారిందని ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన స్థానిక రాజీవ్‌గృహకల్ప కాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళితే..దర్శి మండలం నిమ్మారెడ్డిపాలేనికి చెందిన పరకాల నరశింగం కుమారుడు నాగేశ్వరరావు..నగరంలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో నివాసం ఉండే అక్కా బావ వద్ద ఉంటూ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే చదువు భారంగా ఉందని తరుచూ తండ్రికి చెప్పేవాడు. కాస్త కష్టపడితే మంచిరోజులు వస్తాయని నరశింగరావు కొడుకుకి నచ్చజెప్పేవాడు. ఈ క్రమంలో ఆదివారం అక్కా బావ ఈతముక్కల వెళ్లగా..ఒంటరిగా ఉన్న నాగేశ్వరరావు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం వారు ఇంటికి చూడగా ఉరేసుకొని కనిపించాడు. విషయం తెలుసుకున్న తండ్రి నరశింగం ఘటనా స్థలానికి చేరుకున్నాడు. చదువుకోలేపోతున్నాననే బాధనతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఫిర్యాదు చేశాడు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీపై అవగాహన అవసరం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత తదితరులు

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: డెంగీ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 16న జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా రూపొందించిన అవగాహన పోస్టర్‌ను సోమవారం స్పందన భవనంలో కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. డెంగీ లక్షణాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, అప్పుడే ముందస్తు జాగ్రత్తలతో రక్షణ పొందవచ్చన్నారు. డెంగీ వ్యాధిపై సచివాలయ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులో క్షేత్ర స్థాయిలో పరిశీలించి చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ ఆర్ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, చెన్నయ్య, వరకుమార్, ఉమాదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు. కొత్తపట్నం మండలం సతువారిగుంటకు చెందిన సూర్యప్రకాష్ స్పందనలో అధికారులను కలిసి తాను కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నానని నివసించేందుకు ఇళ్లు కావాలని కోరుతూ స్పందనలో అర్జీ అందజేశాడు. జరుగుమల్లి మండలం పాలేటుపాడు గ్రామానికి చెందిన కోనూరి వీరరాఘవయ్య స్పందనలో అధికారులను కలిసి తనకు గృహ నిర్మాణం పూర్తి చేశామని, అయితే ఇంటి నిర్మాణానికి సంబంధించి బిల్లు రాలేదని, పరిశీలించి త్వరగా బిల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశాడు. దొనకొండ మండలం బూనపల్లె గ్రామానికి చెందిన సప్పిడి కోటమ్మ స్పందనలో కలెక్టర్‌ను కలిసి తనకు సర్వే నంబర్ 36713లో 5.14 ఎకరాల భూమి ఉందని జగనన్న జలకళ ద్వారా బోరు వేయించాలని కోరుతూ అర్జీ అందజేశారు.

మానవత్వం చాటుకున్న సీఐ

- ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సకాలంలో వైద్యం
- సొంత డబ్బు ఇచ్చి అంబులెన్సులో గుంటూరు తరలింపు


జిల్లా వైద్యశాలలో క్షతగాత్రుడిని పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్

మార్కాపురం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని మార్కాపురం సీఐ భీమానాయక్ సకాలంలో ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మార్కాపురం మండలం నికరంపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో సీఐ భీమానాయక్‌కు ఫోన్ రావడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డు పక్కన క్షతగాత్రుడు తీవ్ర గాయాలతో ఉన్నాడు. గుండె, ఊపిరితిత్తులు బయటకి వచ్చి పరిస్థితి భయానకంగా ఉంది. రోడ్డంతా రక్తసిక్తంగా ఉంది. సీఐ నాయక్, రూరల్ ఎస్సై సుమన్ వెంటనే అంబులెన్సులో జిల్లా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అత్యవసరంగా గుంటూరు తీసుకెళ్లాలని వైద్యులు చెప్పడంతో సీఐ అంబులెన్సుకు రూ.5 వేలు డీజిల్ కొట్టించి, ఖర్చుల కోసం మరో రూ.5 వేలు ఇచ్చి సకాలంలో గుంటూరుకు చేర్చడంతో అక్కడి వైద్యులు సర్జరీ చేసి క్షతగాత్రుడిని ప్రాణాపాయం నుంచి కాపాడారు. వేగంగా స్పందించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన సీఐపై ప్రశంసలు వెల్లువెత్తాయి. కాగా క్షతగాత్రుడిని త్రిపురాంతకం మండలం ఒడ్డుపాలేనికి చెందిన పల్లె అంజయ్యగా గుర్తించారు. ఆయన కంభంలో ఒక కార్యక్రమానికి వెళ్లి తన మిత్రుడితో బైక్‌పై వస్తుండగా నికరంపల్లె వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఇద్దరూ స్పృహతప్పి పడిపోయారు. అంజయ్యకు తీవ్ర, ఆయన మిత్రుడికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం అంజయ్య పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తునట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

ఒంగోలు: ఆరేళ్ల బాలికపై 15 ఏళ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఒంగోలు సమీప గ్రామానికి చెందిన ఘటన కావడంతో బాధిత కుటుంబీకులు తాలూకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం..బాలికను టీవీ చూద్దామని తీసుకెళ్లి బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం బాలిక తల్లి ఆలస్యంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బాలికను ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న కారు

- భార్యాభర్తలకు తీవ్ర గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన కారు ముందు భాగం


హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రుడు

సింగరాయకొండ: ముందు వెళ్తున్న కంటైనర్ లారీ ఒక్కసారిగా వేగం తగ్గడంతో ఆ వెనుకే వస్తున్న కారు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం ఉదయం సింగరాయకొండ మండల పరిధిలో జాతీయ రహదారిపై పెరల్ డిస్టిలరీ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన కె.సామిరెడ్డి, శివపార్వతి తమ కుమార్తె వివాహం సందర్భంగా శుభలేఖలు పంచేందుకు నెల్లూరుకు కారులో వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి పెరల్ డిస్టిలరీకి లోడ్‌తో వస్తున్న కంటైనర్ లారీ ఫ్యాక్టరీలోకి వెళ్లే ప్రయత్నంలో అకస్మాత్తుగా వేగం తగ్గింది. ఈ క్రమంలో కంటైనర్ వెనక భాగాన్ని కారు బలంగా ఢీకొట్టింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.